సాక్షి ఏలూరు

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



వనదేవతకు వందనం

బుట్టాయగూడెం: మారుమూల కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువైన **గుబ్బల మంగమ్మతల్లిని దర్శించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.**

వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు **భారీగా వచ్చి చేరుతున్నారు.** 8లో ▸



ఆర్టీసీకి జవసత్వాలు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేలా సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం సంచలనంగా నిలిచింది. ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారమైంది. 8లో ▸

న్యూస్‌రీల్

మేనిఫెస్టోపై ఆనందోత్సాహాలు



ములగలంపల్లిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దళితులు

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో గ్రామ జనాభాలో 50 శాతం దళితులు ఉన్నా, అలాగే 500 జనాభా కలిగిన ఆవాసాలను ప్రత్యేక దళిత పంచాయతీగా ఏర్పాటుచేస్తామని సీఎం జగన్ ప్రకటించడంపై దళితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీలుగుమిల్లి మండలం ములగలంపల్లిలో ఆదివారం దళిత సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి తగరం బాబూరావు ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.


అరవింద్‌కు ఉగాది పురస్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాకు చెందిన వర్ధమాన నటుడు అరవింద్ జాలకు ఉగాది పురస్కారం దక్కింది. తెలంగాణకు చెందిన గోల్డెన్ ఫ్యూచర్ గ్లోబల్ సేవా ఫౌండేషన్, మోర్ ఫౌండేషన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 27న హైదరాబాద్‌లో సినిమా తెలుగు ప్రైడ్ అవార్డు పేరిట ఉగాది పురస్కారాన్ని ఆయన అందించారు. అనన్య చిత్రంలో అరవింద్ జాల ప్రధాన ప్రతినాయకుడి పాత్ర పోషించి ఆకట్టుకున్నారని దర్శకుడు ప్రసాదరాజు అన్నారు.

ఎన్నికలకు పటిష్ట పర్యవేక్షణ

ఏలూరు (మెట్రో): జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో ఫిర్యాదులు ఉంటే పరిశీలకులకు తెలియజేయవచ్చన్నారు. ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో రోజూ ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత నేరుగా పరిశీలకులను కలవచ్చని పేర్కొన్నారు. ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు డాక్టర్ కృష్ణకాంత్ సాధారణ పరిశీలకులు (9154690377), పోలవరం, చింతలపూడి, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎస్‌ఏ రామన్ సాధారణ పరిశీలకులు (9491041437), ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాలకు మేశ్రం గౌరవ్ మధుకర్ వ్యయ పరిశీలకులు (9154243699), చింతలపూడి, నూజివీడు, కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గాలకు పి.కీర్తి నారాయణ్ వ్యయ పరిశీలకులు (8500667695), ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి షేరింగ్ జోర్డన్ భూటియా వ్యయ పరిశీలకులు (9491072224), పి.శ్రీధర్ పోలీసు పరిశీలకులు (9154690388)ను సంప్రదించవచ్చని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు.

ప్రాన్ ప్రతిష్ఠ



ఆక్వాంక్షలు ఫలించె..

- ఆక్వా రైతులకు వెన్నుదన్నుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ప్రపంచంలోనే రెండో సంస్థగా 'అప్సడా' ఏర్పాటు
- ఫీడ్, ప్రాసెసింగ్ కంపెనీలు, హేచరీల ఆగడాలకు అడ్డుకట్ట
- 3,46,000 ఎకరాలకు పెరిగిన ఆక్వా జోన్ పరిధి
- పది ఎకరాలలోపు రైతులకు రూ.1.50కే సబ్సిడీపై విద్యుత్
- గత ప్రభుత్వ బకాయిలు రూ. 340 కోట్లను చెల్లించిన ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా 3,000 ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్‌లు
- నరసాపురంలో రూ.332 కోట్లతో ఆక్వా వర్సిటీకి శ్రీకారం

అయ్యో.. రొయ్య అనే దుస్థితి నుంచి ఆక్వా.. కెవ్వు కేక అనే స్థితికి ఆక్వా రంగం వృద్ధి చెందింది. దళారుల దోపిడీ, గిట్టుబాటు కాని ధరలు, నకిలీ సీడ్, పెరిగిన మేత రేట్లతో కుదేలైన ఈ రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్త ఊపిరిలూదింది. ప్రపంచంలోనే రెండోదిగా ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) ఏర్పాటు చేసింది. 90 వేల ఎకరాలకే పరిమితమైన జోన్ పరిధిని ఐదేళ్లలో 3.46 లక్షల ఎకరాలకు విస్తరించింది. విద్యుత్ సబ్సిడీ రూపంలో రూ.3,420 కోట్లు అందజేసింది. ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్ల ఏర్పాటుతో గృహ వినియోగం పెరిగింది. దేశంలోనే బెస్ట్ మెరైన్ అవార్డుతో ఏపీ కీర్తిని దశదిశలా వ్యాపింపజేసింది.



సాక్షి, భీమవరం: రాష్ట్రంలోని ఏలూరు, పశ్చిమగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, నెల్లూరు తదితర జిల్లాల్లోని 4.65 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. తిరుపతి, నెల్లూరు, ఒంగోలు, ప్రకాశం జిల్లాల్లో టైగర్ జాతికి చెందిన మొనోడా, కోస్తా ఏరియాలో వనామీ సాగుచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 వరకు హేచరీలు, 130 వరకు ప్రాసెసింగ్ యూనిట్లు, 34 ఫీడ్ కంపెనీలు ఉన్నాయి. చైనా, అమెరికా, జపాన్, ఇండోనేషియా తదితర దేశాలకు ఏటా రూ.45 వేల కోట్ల ఎగుమతులు జరుగుతుంటే అందులో రూ.37 వేల కోట్ల ఎగుమతులతో ఏపీ అగ్రస్థానంలో ఉన్నా రైతుకు సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి గత ప్రభుత్వంలో ఉండేది.

ప్రపంచంలోనే రెండోదిగా అప్సడా

ఆక్వా రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వం 2020లో ప్రత్యేకంగా అప్సడాను ఏర్పాటుచేసింది. ప్రపంచంలోనే ఇది రెండోది కావడం గమనార్హం. అప్సడాకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చైర్మన్‌గా, తాడేపల్లిగూడేనికి చెందిన ఆక్వా రైతు వడ్డి రఘురాం వైస్ చైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

కొత్త శకం ఆరంభం

కోస్తా ఆక్వాకల్చర్ అథారిటీ (సీఏఏ) నిబంధనల ప్రకారం ఆక్వా జోన్ పరిధిలోని రైతులకు మాత్రమే ప్రభుత్వ లబ్ధి చేకూరుతుంది. ఈ ఫిష్ సర్వే ద్వారా 10 ఎకరాలలోపు ఉన్న రైతులందరినీ అప్సడా ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకువచ్చింది. చంద్రబాబు హయాంలో జోన్ పరిధిలో కేవలం 90 వేల ఎకరాలు మాత్రమే ఉండగా ఇప్పుడు 3.46 లక్షల ఎకరాలకు పెరగడం గమనార్హం. అప్సడా రాకతో హేచరీలు, ఫీడ్, ప్రాసెసింగ్ కంపెనీలకు ఆగడాలకు చెక్ పెట్టారు. ప్రాసెసింగ్ కంపెనీలతో మాట్లాడి 10 రోజుల పాటు ధరలు స్థిరంగా ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. మేత ధరలను నియంత్రించారు. అనుమతులు లేని హేచరీల తొలగింపుతో పాటు రైతులకు నాణ్యమైన సీడ్ అందించే ఏర్పాట్లు చేశారు.

రూ. 3,420 కోట్ల విద్యుత్ సబ్సిడీ

సబ్సిడీపై యూనిట్ రూ.2కే అందజేస్తామంటూ గత టీడీపీ ప్రభుత్వం డిస్కంలకు రూ.340 కోట్లు బకాయిలు పెడితే రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఆ మొత్తాన్ని జగన్ సర్కార్ చెల్లించింది. రాష్ట్రంలో మొత్తం 63 వేల విద్యుత్ కనెక్షన్లకు గాను జోన్ పరిధిలో 54,080 కనెక్షన్లు క్రమబద్ధీకరించి సబ్సిడీపై రూ.1.50కే విద్యుత్‌ను అందజేస్తోంది. చెరువులతో పాటు అనుబంధంగా ఉండే హేచరీలు, ప్రాసెసింగ్ యూనిట్లకు నిరంతర విద్యుత్ సదుపాయంతో పాటు కనెక్షన్ల మంజూరు ప్రక్రియను సులభతరం చేసింది. సబ్సిడీ రూపంలో రూ. 3,420 కోట్లు ఆక్వా రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేయడం గమనార్హం.

దేశంలోనే మూడో ఆక్వా వర్సిటీ ఏర్పాటు

మత్స్య ఎగుమతులు, మత్స్య సాగులో శాస్త్రీయ పద్ధతులు పెంచేందుకు నరసాపురం మండలం సరిపల్లి వద్ద మత్స్య యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దేశంలోనే ఇది మూడోది కావడం గమనార్హం. రూ.332 కోట్ల వ్యయంతో 40 ఎకరాల స్థలంలో వర్సిటీ పరిపాలన భవనం, హాస్టళ్లు, వీసీ ఛాంబర్ పనులు జరుగుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి లక్ష్మణేశ్వరం తుపాను రక్షిత భవనంలో ఆక్వా కోర్సులు ప్రారంభించారు.





బీమాకు పైలెట్ ప్రాజెక్టుగా ఏపీ : నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌ఎఫ్‌డీబీ), సీబా సహకారంతో 5 ఎకరాలలోపు ఆక్వా రైతులకు బీమా సదుపాయం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కేంద్రంతో మాట్లాడి రాష్ట్రాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసేందుకు సీఎం జగన్ కృషి చేశారు. ఆమోదయోగ్యమైన పాలసీ కోసం బీమా కంపెనీలతో అప్సడా రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది.

విశాఖలో రూ.36 కోట్లతో బీఎంసీ

రాష్ట్రంలోని రైతులు దేశంలోనే అత్యధిక ఉత్పత్తి చేస్తున్నా స్థానికంగా బ్రూడర్ స్టాక్ మెయింటెనెన్స్ సెంటర్ (బీఎంసీ) ఏర్పాటుచేసే దిశగా గత ప్రభుత్వాలేవీ ఆలోచన చేయలేదు. సీడ్ కోసం విదేశాల నుంచి తీసుకువచ్చే తల్లి రొయ్యలను క్వారంటైన్ నిమిత్తం చెన్నైలోని బీఎంసీకి తీసుకువెళ్లేందుకు రైతులు తీవ్ర వ్యయ ప్రయాసలకు గురికావాల్సి వస్తోంది. ప్రస్తుత ప్రభుత్వం విశాఖ జిల్లా నక్కపల్లి మండలం బంగారుపేటలో రూ.36 కోట్లతో బీఎంసీ ఏర్పాటు చేసి ఆగస్టు నాటికి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంది.

ఫిష్ ఆంధ్రాకు శ్రీకారం : స్థానిక వినియోగం పెంచడం ద్వారా రైతులకు లాభసాటి ధర అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టింది. రోజుకు 2,000 నుంచి 2,500 టన్నులు స్థానిక మార్కెట్లలో అమ్ముకునే విధంగా 3,000 అవుట్‌లెట్లు ఏర్పాటు చేసి ఎక్స్‌పోర్ట్ ఉత్పత్తులను స్థానికంగా అందిస్తున్నారు. 13 సార్లు ప్రాన్ అండ్ ఫిష్ ఫెస్టివల్స్ నిర్వహించారు. గత ప్రభుత్వంలో కేవలం రెండు శాతం ఉన్న డొమెస్టిక్ వినియోగం ఇప్పుడు 35 శాతానికి పెరిగింది.

కరోనా కష్టకాలంలో అండగా..



కోవిడ్ సమయంలో రైతుల భయాన్ని ఆసరాగా చేసుకుని ప్రాసెసింగ్ యూనిట్లు 100 కౌంట్ రూ.80, రూ.90కు కొనే పరిస్థితులు నెలకొంటే ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది. 100 కౌంట్ రొయ్యలను రూ.180 ఎంఎస్‌పీగా నిర్ణయం ఇతర రాష్ట్రాల్లో మాదిరి ఆక్వా రంగం కుదేలవ్వకుండా కాపాడింది. దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఆక్వాను నిలిపారు.

– వడ్డి రఘురాం, అప్సడా వైస్ చైర్మన్

కూటమిలో రెబల్స్ కుంపట్లు

నూజివీడు, పోలవరం, ఉండిలో టీడీపీ రెబల్స్ నామినేషన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కూటమి పార్టీల్లో రెబల్ కుంపట్లు చిచ్చు రేపుతున్నాయి. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో మూడు చోట్ల టీడీపీ రెబల్స్ నామినేషన్లు దాఖలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఏలూరు జిల్లా నూజివీడులో మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు టీడీపీ సీటివ్వకుండా మొండిచేయి చూపడంతో ఆయన ఈనెల 18న రెబల్‌గా నామినేషన్ దాఖలు చేశారు. పోలవరంలో రెబల్ అభ్యర్థిగా టీడీపీ నేత మొడియం సూర్యచంద్రరావు ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ తరఫున చిర్రి బాలరాజు ఈనెల 18వ తేదీనే నామినేషన్ వేశారు. కాగా.. బాలరాజుకు పోటీగా టీడీపీ నేత సూర్యచంద్రరావు నామినేషన్ వేయడం చర్చనీయాంశమైంది.

ఉండిలోనూ రెబల్ పోటీ: ఉండి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున వేటుకూరి శివరామరాజు 2009, 2014 ఎన్నికల్లో గెలుపొందారు. 2019లో నరసాపురం ఎంపీగా అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో తన శిష్యుడు మంతెన రామరాజును గెలిపించిన శివరామరాజు.. 2024 ఎన్నికల్లో తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా తిరిగి పోటీకి దిగుతానని చెప్పుకున్నారు. శివరామరాజును కాదని.. ఆయన శిష్యుడు రామరాజును అభ్యర్థిగా ప్రకటించిన టీడీపీ చివరి క్షణంలో ఎంపీ రఘురామకృష్ణరాజుకు అభ్యర్థిత్వాన్ని కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో టీడీపీ రెబల్ అభ్యర్థిగా వేటుకూరి శివరామరాజు నామినేషన్ దాఖలు చేశారు. రామరాజుకు సీటు కేటాయిస్తున్నట్టు టీడీపీ ప్రకటించిన నాటి నుంచే శివరామరాజు రెబల్ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో కూటమి నాయకుల మధ్య అసలు పొసగడం లేదు.

ఏలూరులో 'మేమంతా సిద్ధం'

- 1న సీఎం జగన్ పర్యటన
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభను సూపర్ సక్సెస్ చేసేందుకు ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని రంగం సిద్ధం చేస్తున్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏలూరు నియోజకవర్గంలోని ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. సీఎం జగన్ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ విజయవంతం చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, ప్రజలకు అసౌకర్యం లేకుండా అత్యంత జాగ్రత్తగా పార్టీ నేతలు, శ్రేణులు సభకు హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో సీఎం జగన్ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏర్పాట్ల పరిశీలన : సీఎం జగన్ ఎన్నికల సంగ్రామ భేరి మోగిస్తూ మలివిడత మేమంతా సిద్ధం సభలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు మే 1న ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు సభ ఉంటుంది. ఈ మేరకు ఏర్పాట్లను ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదివారం సాయంత్రం పరిశీలించారు. సభా స్థలాన్ని పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు. సీఎం జగన్ బస్సు పైనుంచి మాట్లాడే పరిస్థితుల్లో ఎక్కడ అయితే ప్రజలకు కనిపిస్తుంది, భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఎలాంటి ఏర్పాట్లు చేయాలనే అంశాలపై నేతలతో చర్చించారు. ఎమ్మెల్యే నానితోపాటు ఈడా చైర్మన్, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎంఆర్ పెదబాబు, నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, నాయకులు ఉన్నారు.

బెయిలీ వంతెనకు మరమ్మతులు



గుండుగొలనులో మరమ్మతుల అనంతరం సాఫీగా రాకపోకలు

భీమడోలు: 'బెయిలీ వంతెనపై ప్రయాణానికి ఇక్కట్లు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం గుండుగొలను వద్ద గోదావరి కాలువపై ఉన్న బెయిలీ వంతెన అడుగు ప్లేట్లకు భీమడోలు ఆర్‌అండ్‌బీ ఏఈ జె.భాస్కరరావు ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు పర్యవేక్షణలో గుండుగొలను ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణ రాజు, సొసైటీ చైర్మన్ నంద్యాల సుబ్బరాజు దగ్గరుండి పనులకు సహకరించారు. సుమారు రూ.70 వేల విలువైన 600 కిలోల ఐరన్‌తో ప్లేట్ల మరమ్మతులు పూర్తిచేశారు. దీంతో వాహన రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

చింతమనేని నామినేషన్ రద్దు చేయాలి

దెందులూరు: ఓటు వేయను అన్నందుకు దళితులపై, టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరినందుకు, మరో ఇద్దరిపై కిరాతకంగా దాడి చేసి కించపరిచేలా దుర్మార్గంగా మాట్లాడారని, అనుచరులతో కొట్టించిన దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ నామినేషన్‌ను రద్దు చేయాలని ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు డిమాండ్ చేశారు. చింతమనేని పెదవేగి మండలంలో చేసిన దౌర్జన్యకాండను పూర్తి ఆధారాలతో ఎన్నికల ప్రత్యేక అబ్జర్వర్, ఎస్సీ, ఎస్టీ కమిషన్, రాష్ట్ర హైకోర్టుకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆదివారం ఏలూరు వైద్యశాలలో చింతమనేని చేసిన దాడి కారణంగా గాయపడ్డ వివిధ గ్రామాల బాధితులను పరామర్శించారు. సంఘటనా వివరాలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం చైర్మన్ కొమ్మూరి విలేకరులతో మాట్లాడుతూ చింతమనేనిపై 93 కేసులు పలు పోలీస్‌స్టేషన్లలో ఉన్నాయని, కోర్టులు, ఎన్నికల సంఘం పరిగణనలోనికి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దౌర్జన్యకాండకు నిరసనగా రాష్ట్రవ్యాప్త ప్రణాళికను త్వరలోనే ప్రకటిస్తామని ఆయన అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెరికే వరప్రసాదరావు మాట్లాడుతూ చింతమనేని ప్రభాకర్, అతని అనుచరులు పెదవేగి మండలంలోని బాధితులకు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితులు, బీసీలు ఉమ్మడి సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాక్రమాన్ని ప్రకటిస్తామని హెచ్చరించారు. కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, మున్నుల జాన్‌గురునాథ్, మొండూరు సర్పంచ్ రాజూరి బాలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెరికే

ఎన్నికల ఖర్చుపై పర్యవేక్షణ తప్పనిసరి

భీమవరం(ప్రకాశం చౌక్): ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, ఇతర వ్యయాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆర్థిక లావాదేవీలు, నగదు బట్వాడా, బహుమతులు, ఇతర వస్తువులు తరలింపు, మద్యం రవాణా తదితర అంశాలపై నిరంతర పర్యవేక్షణ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషిచేయాలని ఆయన అన్నారు.

ప్రచారంలో ఆటవిడుపు



బుట్టాయగూడెం మండలం ములగలంపల్లిలో ప్రచారంలో భాగంగా క్రికెట్ ఆడుతూ ఆకట్టుకున్న వైఎస్సార్‌సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి

ప్రజలతో మమేకం



చింతలపూడిలో దుకాణంలో మటన్ కొడుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి కంభం విజయరాజు

క్లుప్తంగా

రెండు మోటార్‌సైకిళ్ల ఢీ

- వ్యక్తి మృతి, మరో వ్యక్తికి తీవ్రగాయాలు
- అలంపురం హైవే వద్ద ఘటన



గాయాలతో ఘటనా స్థలంలో ఉన్న ఎం. రాజు

పెంటపాడు: అలంపురం వద్ద జాతీయ రహదారిపై రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు, పెంటపాడు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకు చెందిన మాడు రాజు (45) ఆదివారం మధ్యాహ్నం మోటార్‌సైకిల్‌పై గూడెం వైపు వెళుతున్నాడు. అలంపురం వద్ద అదే రోడ్‌లో అలంపురం వైపు రాంగ్ రూట్‌లో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న నాగరాజు ఇతనిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోడ్డు డివైడర్‌పై పడిపోయిన రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. నాగరాజుకు కూడా స్వల్పగాయలు అయ్యాయి. వీరిద్దరిని హైవే అంబులెన్స్‌లో తణుకు ఆసుపత్రికి తరలిస్తుండగా తణుకుకు చెందిన రాజు మృతి చెందాడు. మృతుని కుమారుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెంటపాడు పోలీసులు తెలిపారు.

ఘనంగా కనక ముత్యాలమ్మ సేవా మహోత్సవం

పెంటపాడు: మండలంలోని ముదునూరుపాడు గ్రామ దేవత కనకముత్యాలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు పురస్కరించుకొని ఆదివారం రాత్రి అమ్మవారి సేవా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవకమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తీన్‌మార్, ఆసాదుల నృత్యాలు, కాంతార వేషాలతో ముదునూరుపాడు గ్రామం వీధులలో అమ్మవారిని ఊరేగించారు. మార్చి 23న అమ్మవారి మొదటిసేవ, ఏప్రియల్ 21న అమ్మవారి రెండోసేవ నిర్వహిస్తున్నట్లు ఏప్రియల్ 28న అమ్మవారి మూడోసేవ చేశామన్నారు. అయితే మే 18న అగమజాతర, 19న పొన్న, తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవకమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాతర మహోత్సాలను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లారీ ఢీకొని కారు ధ్వంసం

పాలకోడేరు: భీమవరం నుంచి వేంద్ర వెళుతున్న లారీ పాలకోడేరు మెయిన్‌రోడ్డు వాటర్ ట్యాంక్ వద్ద ఆగి ఉన్న కారును శనివారం అర్ధరాత్రి ఢీకొంది. ఆ సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారుమాత్రం పూర్తిగా ధ్వంసం అయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

జగన్‌తో ఆర్టీసీకి జవసత్వాలు

- ప్రభుత్వంలో విలీనంతో ఆర్టీసీకి జీవం పోసిన జగన్
- సీఎం సాహసోపేత నిర్ణయంతో ఉద్యోగుల కల సాకారం
- ఉద్యోగ భద్రతతో ఊపిరి పీల్చుకున్న సంస్థ సిబ్బంది
- లాభనష్టాలతో నిమిత్తం లేకుండా సకాలంలో జీతాలు
- ఏలూరు, పశ్చిమ జిల్లాల్లో 2,296 మంది ఆర్టీసీ ఉద్యోగులు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, ఉద్యోగుల భద్రతలపై అనేక ప్రజాదరణ పథకాలు, విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్న వైఎస్ జగన్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని తీసుకున్న నిర్ణయం సంచలనాలకే సంచలనంగా మారింది. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కావాలన్న ఉద్యోగుల చిరకాల స్వప్నాన్ని జగన్ సాకారం చేశారు. దీంతో అభద్రతాభావంతో ఉన్న సంస్థ ఉద్యోగులకు జగన్ వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చారు. గతంలో కేంద్రంతో పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు, పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా రాజకీయ వైతాళికునిగా తనను తాను చిత్రించుకునే చంద్రబాబుగానీ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే సాహసం చేయలేకపోయారు.

ఏలూరు (ఆర్‌ఆర్ పేట) : ఆర్టీసీ సంస్థ ఉంటుందా.. ఎప్పుడూ నష్టాల్లోనే.. ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితి.. నాలుగేళ్లకోసారి జీతాల ఫిట్‌మెంట్ చేయాల్సిన నిబంధన ఉన్నా ఎంత మేరకు అమలు చేస్తారు.. సంస్థను ప్రైవేటు పరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందట.. మన ఉద్యోగాలు ఉంటాయా.. ఉంటే జీతాలు ఇప్పుడు ఇచ్చినట్టుగానే ప్రైవేట్ సంస్థ ఇస్తుందా.. ఇదీ 2019 ముందు వరకు ఆర్టీసీ ఉద్యోగులను తీవ్రంగా కలచివేసిన ప్రశ్నలు. సవాలక్ష ఆలోచనలతో ఉద్యోగులు దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్టుగా సంస్థలో కొనసాగేవారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాలన్నీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ దశాబ్దాల తరబడి పోరాటాలు చేసినా ఏ ప్రభుత్వమూ వారి మొర ఆలకించిన పాపాన పోలేదు. అటువంటి తరుణంలో 2019వ సంవత్సరంలో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న కీలక నిర్ణయంతో ఆర్టీసీ బతికింది.



ఏలూరు డిపో గ్యారేజ్‌లో ఆర్టీసీ బస్సులు

తొలినాళ్లలో ఏకఛత్రాధిపత్యం

ఆర్టీసీ సంస్థ ప్రారంభించిన తొలినాళ్లలో ప్రజలకు ప్రత్యామ్నాయ రవాణా సాధనాలు లేకపోవడంతో ప్రజా రవాణా రంగంలో ఆర్టీసీ బస్సులు ఏకఛత్రాధిపత్యంతో నడిచాయి. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో ప్రజల ఆదాయ మార్గాలు గణనీయంగా పెరగడంతో అందరికీ సొంతంగా ద్విచక్రవాహనాలు అందుబాటులోకి రావడం, ప్రజా రవాణాలో ప్రైవేట్ వాహనాలు చొచ్చుకురావడంతో ఆర్టీసీ పతనం దిశగా అడుగులు వేసింది. ఈ నేపథ్యంలో నిర్వహణ సంస్థకు భారంగా మారడంతో ప్రతి ఏటా నష్టాలను చవిచూసింది. ఇటువంటి పరిస్థితిలో 2005వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్టీని ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారనే వార్త ఆర్టీసీ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అలజడిని రేపింది. ఆర్టీసీని తొలుత రామోజీరావుకు, అనంతరం ఎస్‌ఆర్‌ఎంటీ సంస్థకు కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారని విశ్వసనీయంగా తెలియడంతో ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు రోడ్డెక్కి గట్టి ఆందోళన చేయడంతో చంద్రబాబు వెనక్కి తగ్గినట్లు అప్పట్లో పోరాటాలు చేసిన యూనియన్ నాయకులు చెబుతున్నారు. ఆ తరువాత మరోసారి చంద్రబాబు రిలయన్స్ సంస్థకు ఆర్టీసీని కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నారనే విషయం వెలుగు చూడడం.. ఉద్యోగులు మళ్లీ రోడ్డెక్కడంతో ఆ ప్రతిపాదన విరమించుకోవడం జరిగిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఆర్టీసీ ఉద్యోగులు గుండెల మీద చేయివేసుకుని ప్రశాంతంగా పని చేసుకోగలుగుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలు వర్తింపు..

ఉమ్మడి జిలాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, నరసాపురం డిపోల్లో మొత్తం 2,296 ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారిలో ఏలూరు జిల్లాలో మొత్తం 1,074 మంది ఉద్యోగులు ఉండగా, వారిలో 408 మంది డ్రైవర్లు, 406 మంది కండక్టర్లు, 260 మంది ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1,222 మంది ఉద్యోగులు ఉండగా వారిలో 456 మంది కండక్టర్లు, 443 మంది డ్రైవర్లు, మరో 323 మంది ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వ ఉద్యోగులకు అందే ప్రయోజనాలు అన్నీ అందుతున్నాయి.

ఆర్టీసీ, ప్రైవేట్‌కు సమానంగా ఇంధన పన్ను

సంస్థ నష్టాల్లో నడుస్తుండడంతో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం సంస్థ లాభనష్టాలను బేరీజు వేసుకుని జీతాలు చెల్లించే విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నించారు. ఉద్యోగుల నుంచి వచ్చిన వ్యతిరేకత కారణంగా ఆ ఆలోచనను విరమించుకున్నారు. ప్రజలకు ప్రత్యామ్నాయ రవాణా సాధనాలు అందుబాటులోకి రావడం, ఆర్టీసీ వినియోగించే ఇంధనంపై పన్ను ప్రైవేటు వాహనాలకు ఇచ్చే ఇంధనంపై వసూలు చేసే పన్ను కంటే అధికంగా ఉండడంతో ఆర్టీసీకి నష్టాలు వస్తున్నాయని అప్పట్లో ఉద్యోగులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఆ పన్నును ఆర్టీసీకీ, ప్రైవేటుకు సమానంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఆర్టీసీ ఉద్యోగులకు మరింత ఉద్యోగ భద్రత చేకూరడంతో పాటు వారికి ట్రెజరీల ద్వారా జీతాల చెల్లింపులు ప్రారంభమయ్యాయి. అలాగే గతంలో చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలకు పెంచి ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం వర్తింపచేయలేదు. ప్రస్తుతం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల్లానే ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెరగడంతో ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

జగనన్న పాలనలోనే సంక్షేమ రాజ్యం

వరదరాజపురం ప్రచారంలో ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం : ముఖ్యమంత్రి జగన్ సారధ్యంలో రాష్ట్రం సంక్షేమ రాజ్యంగా అవతరించిందని ఐదేళ్ల పాలనలో పేదలకు నూరుశాతం న్యాయం జరిగిందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. దివారం రాత్రి వరదరాజపురంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తొలుత ఎస్సీ పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాగైనా అధికారం దక్కించుకోవాలన్న ఏకైక లక్ష్యంతో చంద్రబాబు అలవికాని హామీలను ఇస్తున్నారని, ఈ హామీలతో ప్రజలను ఏమార్చి పదవి దక్కించుకోవడమే బాబు లక్ష్యమన్నారు. 2014లో చంద్రబాబు, పవన్, బీజేపీ కూటమిగా ఏర్పడి ఎన్నో హామీలను గుప్పించి, అధికారంలోకి వచ్చాక వాటిని చెత్తబుట్టలో పడేశారని గుర్తు చేశారు. ఇప్పుడు అంతకు మించిన హామీలను మూటకట్టుకుని కూటమి నేతలు ప్రజల ముందుకు వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మకుండా నిజంగా పేదలకు మేలుచేస్తున్న జగనన్నను మరోసారి గెలిపించాలని కోరారు. సిపార్సులు, లంచాలు లేకుండా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, అలాంటి పారదర్శక పాలన జగన్‌తోనే సాధ్యమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లామన్నారు. గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ దండు రాము, సర్పంచ్ గుర్రం సుబ్బారావు, నాయకులు ఆకువీటి కోటేశ్వరరావు, కేశవ, మునేశ్వరరావు, శామన నాగు, జి.సురేష్, రాపాక రమేష్, గుర్రం నాగరాజు, రాపాక రామకృష్ణ, సహదేవుడు, ఇంటి శ్రీను, కాకర్ల శ్రీను, కొనిశెట్టి రమేష్ పాల్గొన్నారు.



వరదరాజపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

వచ్చే జగనన్న ప్రభుత్వంలో మరింత సంక్షేమం

దెందులూరు ఎమ్మెల్యే కొఠారు

పెదవేగి: వచ్చే జగనన్న ప్రభుత్వంలో మరింత సంక్షేమం అందుతుందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం బి.సింగవరం, కొప్పాకగూడెం, అంకన్నగూడెం, దుగ్గిరాల గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిందే చేస్తారని, మాట తప్పడం, మడమ తిప్పడం ఆయన డీఎన్ఏలో లేదన్నారు. జగనన్న నిన్న మంచి చేశారు, రేపు కూడా మంచి చేసే అద్భుతమైన మ్యానిఫెస్టో విడుదల చేశారన్నారు. టీడీపీ అభ్యర్థి చింతమనేనికి ఇవే చివరి ఎన్నికలు అయ్యేలా ప్రజలందరూ కలిసి తక్కుతక్కువగా ఓడించాలన్నారు. అంకన్నగూడెంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.35 కోట్ల విలువైన లబ్ధి చేకూర్చామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే తనను, ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ తాతా రమ్య, కొప్పాక సొసైటీ అధ్యక్షులు చల్లగొళ్ళ భూస్వామి, బి.సింగవరం సర్పంచ్ పరసా సరస్వతి, అంకన్నగూడెం సర్పంచ్ దుక్కిపాటి మహాలక్ష్ముడు పాల్గొన్నారు.



అంకన్నగూడెంలో ప్రచార ర్యాలీలో దివ్యాంగుడిని ఆప్యాయంగా హత్తుకున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

కూటమి అభ్యర్థులకు ఓటేస్తే కొంప కొల్లేరే

కైకలూరు అసెంబ్లీ, ఏలూరు ఎంపీ అభ్యర్థులు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్

ముదినేపల్లి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు ఓటేస్తే కొంప కొల్లేరు అవుతుందని వైఎస్సార్ సీపీ కై కలూరు అసెంబ్లీ, ఏలూరు ఎంపీ అభ్యర్థులు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ ఓటర్లను హెచ్చరించారు. మండలంలోని చినపాలపర్రు, కోడూరు, పెదపాలపర్రు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర పేరుతో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి పేరుతో టీడీపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పుట్టా మహేష్‌యాదవ్, కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ తరఫున పోటీ చేస్తున్న కామినేని శ్రీనివాస్ కొల్లేరుకు వచ్చే వలస పక్షుల్లాంటి వారని విమర్శించారు. రాజకీయాలను వ్యాపారంగా మార్చుకుని అవినీతికి పాల్పడే ఇలాంటి వారికి ఓటేస్తే ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రజలకంటికి కనిపించకుండా పారిపోతారన్నారు. స్థానికేతురలైన వీరికి రేపటి ఎన్నికల్లో పరాజయాన్ని రుచి చూపించి నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. జగనన్న ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు ఎంతో సమర్ధవంతంగా అమలు జరిగాయన్నారు. ప్రతి కుటుంబంలోని అక్కచెల్లెమ్మలకు, రైతన్నలకు, వృద్ధులకు ఆర్థికంగా ఎంతో మేలు జరగడంతో వారి కళ్ళల్లో ఆత్మ సంతృప్తి కనిపిస్తోందన్నారు. దీనితో వీరంతా జగనన్నే తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి తమకు అఖండ విజయాన్ని అందించాలని కోరారు. జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావడానికి ప్రజలంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలకాలన్నారు. ప్రచారంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ,జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పోరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ నియోజకవర్గ,మండల స్థాయి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కోడూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, సునీల్ కుమార్ యాదవ్

పేదల పక్షాన వైఎస్సార్ సీపీ

వైఎస్సార్ సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): పోలవరం నియోజకవర్గంలో ప్రసుత్తం విపత్కరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని వైఎస్సార్ సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం ఆమె ములగలంపల్లిలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి విలేకర్లతో మాట్లాడుతూ తన భర్త తెల్లం బాలరాజు ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలిచి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని చెప్పారు. అయితే జగనన్న ఈ ఎన్నికల్లో మహిళగా నాకు అభ్యర్థిగా అవకాశం కల్పించారని తెలిపారు. మీ కుటుంబానికి మేలు జరిగితేనే మాకు ఓటు వేయండి అని జగనన్న చెప్పిన ప్రకారం మేము ఎన్నికల ప్రచారం చేస్తుంటే జనసేన అభ్యర్థి తమపై వ్యక్తిగత విమర్శలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా తన భర్త తెల్లం బాలరాజు వైఎస్సార్ పాలనలో రోడ్లు, హైలెవెల్ బ్రిడ్జిలు, అటవీ హక్కుల చట్టం పట్టాలు, పోగొండ రిజర్వాయర్‌తోపాటు అర్హులైన పొగాకు రైతులకు బ్యారన్ లైసెన్స్‌లు ఇప్పించారన్నారు. అయితే కొంతమంది తామే చేశామని చెప్పుకోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో గడచిన 58 నెలల్లో పోలవరం నియోజకవర్గంలో అభివృద్ధి విరబూసిందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని అన్నారు. ప్రజలకు మంచి చెయ్యడమే జగనన్న లక్ష్యం అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి పోలవరం ఎమ్మెల్యేగా అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జీలుగుమిల్లి మండలం రౌతుగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి రాజ్యలక్ష్మి

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ, జనసేన నేతలు



అల్లినగరంలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ప్రజా ఆశీర్వాదయాత్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమక్షంలో ఆదివారం టీడీపీ, జనసేన పార్టీల నుంచి భారీగా నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. కొర్లపాడు నుంచి 100 మంది టీడీపీ కార్యకర్తలు పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. లింగాల ప్రజా ఆశీర్వాదయాత్ర కొనసాగుతుండగా టీడీపీ, జనసేన గ్రామ నాయకుల ఆధ్వర్యంలో మండల నాయకులు తుమ్మల లక్ష్మణస్వామి అనుచరులతో పార్టీ సభ్యత్వాలను వీడి ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. అల్లినగరంలో ప్రజా ఆశీర్వాదయాత్ర కొనసాగుతుండగా 100 మంది జనసేన, టీడీపీ కార్యకర్తలు పార్టీ సభ్యత్వాలను వీడి ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం తెలిపారు.



కొర్లపాడులో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలు



లింగాలలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

బీసీలంతా వైఎస్ జగన్ వెంటే

గౌడ సంఘీయుల ఆత్మీయ సభలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పక్కన కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్

నూజివీడు: పేద, బడుగు వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే రాష్ట్రంలోని బీసీలందరూ నడుస్తున్నారని, సీఎం జగన్ బీసీల పక్షపాతి అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన గౌడ సంఘీయుల నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నూజివీడుకు వలస పక్షిని తెచ్చి పెట్టారని, ఈ పక్షికి పట్టణంలో వార్డులు, నియోజకవర్గంలో మండలాలు తెలియవన్నారు. అతనికి మంత్రి పదవి రాలేదని బాధేగాని, తన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే ధ్యాసే లేదన్నారు. తాను ఎప్పుడూ నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి గురించే ఆలోచన తప్పితే మంత్రి పదవి కోసం పాకులాడలేదన్నారు. నూజివీడు నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి ఏమిటో ఇక్కడి ప్రజలకు తెలుసని, ఎక్కడి నుంచో వచ్చిన పార్థసారథికి ఏం తెలుస్తుందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్‌సీపీదేనని స్పష్టం చేశారు. మరో అతిథి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు అధిక ప్రాధాన్యతనిచ్చిన వ్యక్తి సీఎం జగన్ మాత్రమేనన్నారు. 12 ఎంపీ సీట్లు బీసీలకు కేటాయించారని, ఏలూరు పార్లమెంట్ సీటును తొలిసారి బీసీకి ఇచ్చిన వ్యక్తి వైఎస్ జగన్ అన్నారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వార్డు సభ్యుల దగ్గర నుంచి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వరకు నామినేషన్ల పదవులు, ప్రజాప్రతినిధులుగా 50 శాతం పదవులను బీసీలకు ఇచ్చారన్నారు. గతంలో ఏ రాజకీయపార్టీ బీసీలకు ఇంత ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. బీసీలందరూ జగన్‌కు అండగా ఉండాలన్నారు. డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ, ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జిల్లా నాయకులు పడమట సురేష్ బాబు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష ప్రసంగించారు. వైఎస్సార్‌సీపీ ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల అధ్యక్షులు పలగాని నరసింహారావు, మిద్దే బాలకృష్ణ, నాయకులు ఆరేపల్లి రాంబాబు, పామర్తి రాధాకృష్ణ, మరీదు శివ తదితరులు పాల్గొన్నారు.